# కనబడు చీకటి



"ఎవరది?"

"నేను"

"నేనంటే?"

"నేనంటే నేనే" బెట్టుచేశాడు వచ్చిన వ్యక్తి.

ఆ వచ్చిన వ్యక్తి ఆరడుగుల పొడుగు ఉన్నాడు. ఒరాంగ్‌టాంగ్‌లా ఆజానుబాహువు. తలమీద తుప్పజుట్టు. తిలతండుల న్యాయం. చెవులను కప్పేస్తున్న సైడ్ బర్న్సుతో అతడిముఖం కొండముచ్చు ముఖంలా ఉంది. ముక్కుపొడుం రంగు పాంటులో అదే రంగు షర్టు టక్ చేశాడు. ఆ రెండూ మాసిపోయి ఉండడంతో అతనికి భల్లూకంరూపు వచ్చింది. పైగ నల్లటి ఫ్రేముతో దళసరి కళ్ళద్దాలు.

అతడి జవాబుకి అరుగుమీద కూర్చున్న వ్యక్తి చిన్నగా నవ్వేడు.

ఆ నవ్వుకి జాంబవంతుడు ఇరిటేట్ అయిపోయాడు. "ఇన్నేళ్ళ తరువాత వస్తే ఇదా పలకరింపు? ఇదా ఆతిధ్యం? అన్నేళ్ళ స్నేహాన్ని మరిచిపోయి ఇలా ఎన్నడూ ఎరగని వాణ్ణి చూసినట్టు చూస్తావనుకోలేదు" అన్నాడు కోపంగా.

"నన్నే నే నెరగను. నిన్నేం ఎరుగుదును? అయినా— ఎరిగినవాళ్ళూ ఎరగని వాళ్ళూ అంతా నాకిప్పుడు ఒకటేరా రామదాసూ" అన్నాడు అరుగుమీద వ్యక్తి.

పేరుపెట్టి పిలిచినందుకు సంతోషం కలిగినా, ఆ జవాబు రామదాసుకి మరింత కోపాన్నే కలిగించింది. "ఎప్పటినుంచి ఈ వేదాంతం?" అన్నాడు వ్యంగ్యంగా.

"చూపు పోయినప్పటినుంచీ" అని క్లుప్తంగా వచ్చింది జవాబు.

అవాక్కయ్యాడు రామదాసు. చటుక్కున అతడి పక్కనే కూచుని, "నిజంగానా, విశ్వనాథం? అయామ్ సారీ...కాని, 'అలా' కనిపించడంలేదే!" అన్నాడు.

# మిలమిల మెరిసే కళ్ళు నెత్తినెక్కరాదు సుమా!

"కనిపించకపోవడమే గుడ్డితనం" అన్నాడు విశ్వనాథం విషాదంగా నవ్వుతూ.

అలా ఎందుకన్నాడో, గుడ్డితనం ఎవరిదో తెలియక అయోమయంలో ఒక్కక్షణం మౌనం వహించాడు రామదాసు.

"అమ్మాయ్" అంటూ లోపలికి కేకేశాడు విశ్వనాథం.

దాదాపు పాతికేళ్ళ వయసుగల యువతి వచ్చింది లోపలి నుంచి. అందంగా, హుందాగా, శుభ్రంగా, సింపుల్‌గా ఉంది. "ఏం నాన్నా?" అంది.

"చూడమ్మా, నా చిన్ననాటి స్నేహితుడు రామదాసని చెపుతూంటానే— ఇతనే" పరిచయం చేశాడు ఆనందంగా.



ఆ అమ్మాయి వినయంగా, ఆప్యాయంగా నమస్కరించి, "మీ గురించి తరచు చెపుతుంటారండీ మా నాన్న" అంది.

"ఇక నాకు భవిష్యత్తూ, వర్తమానమూ ఏవీలేవు కదురా రామదాసూ. మిగిలింది గతం ఒక్కటే. ఆ గతాన్నే మాటిమాటికీ తలుచుకుంటూ ఉంటాను. ఇంకేం చెయ్యాలి గనక రోజంతా?" అన్నాడు విశ్వనాథం.

దానికి ఏమనాలో తోచక ఇబ్బందిగా చూస్తూ ఉండిపోయాడు రామదాసు.

ఆ యువతి కలగజేసుకుంది. "కాఫీ తెస్తాను తాగేక స్నానం చేద్దురుగాని. ఈలోగా వంట పూర్తవుతుంది" అంది.

రామదాసు తల ఊపేడు. "ముందు స్టేషన్‌కి వెళ్ళి క్లాక్‌రూమ్‌లో ఉన్న నా సామాన్లు తెచ్చుకోవాలి. నువ్విక్కడ ఉన్నావో లేదో, దొరుకుతావో లేదోనని అనుమానంతో అక్కడే ఉంచేశాను" అన్నాడు విశ్వనాథంతో.

"నేనిక్కడ ఉండక ఇంకెక్కడికి వెళతాను? అది సరేగాని నీ సంగతి చెప్పు. ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు? పెళ్ళి చేసుకున్నావా? స్థిరమైన ఉద్యోగం సంపాదించేవా? సంతృప్తిగా, ప్రశాంతంగా గడుపుతున్నావా జీవితం?" అంటూ ప్రశ్నలు కురిపించాడు విశ్వనాథం.

"విశ్వనాథం, నీ వేల్యూస్ వేరు. నా వేల్యూస్ వేరు. అవి సమాంతర రేఖలు. ఎప్పటికీ కలవవు. ఏదైతే జీవితంలో ముఖ్యమని నువ్వు అనుకుంటావో, అది నేను సాధించేనా లేదా అని అడుగుతున్నావు. అలా అయితే లేదనే చెప్పాలి" అన్నాడు రామదాసు.

విశ్వనాథం మందహాసం చేశాడు. "నా విలువల సంగతి సరే. పోనీ జీవితంలో ఏది ప్రధానమని నువ్వనుకున్నావో అదైనా సాధించేవా? లేకపోతే 'రోలింగ్ స్టోన్ గాదర్స్ నో మాస్' అన్నట్టు ఉండిపోయావా?"

"మాస్ అనే పదానికి 'నాచు' అని కూడా అర్థం ఉంది తెలుసా విశ్వనాథం? ఆ అర్థం తీసుకుంటే—నిత్యం డైనమిక్‌గా ఉండే మనిషి పాకుడు పట్టిపోడు అని అర్థం. కదలకుండా ఒకేచోట ఉండేవాడు నాచుపట్టినా, తుప్పుపట్టినా ఆశ్చర్యం ఏముంది?" ఆవేశంగా అన్నాడు రామదాసు.

"ఇన్నేళ్ళయినా నీ ధోరణి మారలేదురా రామదాసూ! చిన్నమాటకే కోపం తెచ్చేసుకుని కయ్యానికి కాలుదువ్వుతూ మాట్లాడతావు" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ.

ఉడుకుమోత్తనంతో కాబోలు రామదాసు ఏమీ మాట్లాడలేదు.

"ఊ సరే అయితే ఇంకా ఘోటక బ్రహ్మచారివే అన్నమాట..."

"ఓ యస్. స్వతంత్రం భోజనం, మఠం నిద్ర! చూశావా, ఇన్నేళ్ళు విదేశాల్లో ఉన్నా మన మాటతీరు, జాతీయాలూ మరిచిపోలేదు నేను!" సగర్వంగా అన్నాడు రామదాసు.

"కాని జాతీయాలూ, సామెతలూ కాదు ముఖ్యం. నీకు ఇక్కడున్నపుడూ అక్కడున్నపుడూ కూడా అసలు తత్వం బోధపడినట్టులేదు..."

"పోనిద్దూ, నాకా వేదాంతం అంటే మొదటినించీ బోరు. నేను మెటీరియలిస్టుని, హేతువాదిని... అదిసరేగ్గాని, నీకు అప్పుడే ఇంత కూతురంటే ఆశ్చర్యంగా ఉందిరా" అన్నాడు రామదాసు.

"నలభై ఆరేళ్ళ వాడికి ఇరవై ఆరేళ్ళ కూతురు ఉండడంలో ఆశ్చర్యం ఏముంది? నాకు కాలేజీలో ఉండగానే పెళ్ళయింది కదా అంచేత హేతుబద్ధమే" అని నవ్వేడు విశ్వనాథం. "కాని అదింకా నా ఇంటనే ఉండడమే విచారం..." అని కూడా అన్నాడు.

"మరి...నీ భార్య?"



కె. గోదావరి శర్మ

"అదృష్టవంతురాలు. నా గుడ్డి కళ్ళు చూడకుండానే అది కళ్ళు మూసింది.''

"సారీ'' అన్నాడు రామదాసు.

కాఫీ వచ్చింది. దాని పలచదనం, చప్పదనం ఆ ఇంటి ఆర్థిక స్థితిని తెలియజేస్తున్నాయి. కష్టపడి తాగేసి, "సరే, సామాన్లు తీసుకొస్తాను'' అంటూ లేచాడు రామదాసు.

• • • • • •

కొన్ని రోజులు గడిచాయి.

ఓ నాటి మునిమాపువేళ— విశ్వనాథం దగ్గర సంగీత పాఠం చెప్పుకోవడానికి వచ్చిన పిల్లలు "వస్తామండీ, నమస్కారం'' అని శెలవు పుచ్చుకున్నారు. ఆఫీసు నుంచి వచ్చిన గాయత్రి అప్పుడే స్నానంచేసి రాత్రికి వంట ప్రయత్నం చేస్తున్నది.

విద్యార్థులకి శెలవిచ్చి పంపేసి గుమ్మాలూ, గోడలూ తడుముకుంటూ లోపలకి వచ్చాడు విశ్వనాథం. "అమ్మాయ్'' అని అనునయంగా పిలిచి, "రామదాసు...'' అన్నాడు.

"లేరు నాన్న. సాయంకాలంపూట అలా షైరు వెళ్తారు కదా రోజూ? మళ్ళీ ఇప్పుడప్పుడే రారేమో ఏడున్నరా ఎనిమిదీ అయితే గాని!'' అంది గాయత్రి.

"ఊ'' అన్నాడు విశ్వనాథం, ఒక కుర్చీ చేత్తో తడిమి అందులో కూర్చుంటూ.

"ఏం నాన్నా, ఏమన్నా మాట్లాడాలా?'' తండ్రి ఇంగితాన్ని గ్రహించి అంది గాయత్రి.

"వాడితో కాదు, నీతోనే మాట్లాడాలమ్మా...''

"చెప్పండి నాన్నా'' సౌమ్యంగా ఉంది ఆమె గొంతు.

"ఎలా చెప్పాలో తెలియడంలేదమ్మా'' నిట్టూర్చాడు తండ్రి'' నేనేమో కళ్ళులేని కబోదినయ్యాను. ఆడపిల్లవి నీ సంపాదనమీద పడి తింటున్నాను—''

"నాన్నా!'' గాయత్రి అతడి మాటలకి అడ్డు పడింది. "అదేం మాట? ఇన్నేళ్ళూ నన్ను మీరు పెంచి పెద్ద చెయ్యలేదూ? రుణం తీర్చుకోవద్దూ నేను?''

"కాని ఇలా ఎన్నాళ్ళూ? నీకూ పెళ్ళి, సంసారం, ఇల్లూ పిల్లలూ వద్దా తల్లీ! నా అసమర్థత కారణంగా నీ జీవితం ఇలా పూలూ పళ్ళూ లేని మోడైపోవాలా?''

ఆవేదనగా అన్నాడు విశ్వనాథం.

"అలా ఎప్పుడూ అనుకోవద్దు నాన్నా! జీవితానికి పెళ్ళి ఒక్కటే పరమార్థమా? అంతో ఇంతో చదువు చెప్పించారు నా అదృష్టం బాగుండి ఏదో ఉద్యోగం దొరికింది. ఒకరిమీద ఆధారపడకుండా స్వతంత్రంగా బతుకుతున్నాం. ఇంకేం కావాలి? పూర్వకాలం స్త్రీలలా కాదు నాన్నా, ఇప్పుడు పెళ్ళికి అంత ప్రాధాన్యతలేదు'' అంది గాయత్రి.

"కాదనను తల్లీ, నిజమే. రోజులు మారిపోయాయి. ఆడపిల్లలకూ చదువులూ ఉద్యోగాలూ అవసరమే. కాని ఆడైనా మగైనా ఎప్పుడో ఒకప్పుడు వివాహం చేసుకోవాలమ్మా! లేకపోతే ఆ జీవితం సంపూర్ణం, సమగ్రం కాదు. ఆఫీసుకి వెళ్ళిరావడం, వంటవండుకుతినడం— ఇంతే కాదు కదమ్మా జీవితం అంటే!'' సుఖపడవలసిన వయసులో కూతురు సుఖపడడంలేదన్న చింత, దైన్యం విశ్వనాథం గొంతులో వ్యక్తమయ్యాయి.

"చూద్దాంలెండి నాన్నా'' లోగొంతుకలో నెమ్మదిగా అంది గాయత్రి. "నా యోగం ఎలా ఉందో అలా జరుగుతుంది. రోజులన్నీ ఒకేలా ఉండవు కదా!'' అంది.

ఆమె మాటలు విశ్వనాథాన్ని కొంచెం ప్రోత్సహించాయి. "అదేనమ్మా! ఆ మంచి రోజులు వచ్చాయని నాకనిపిస్తూంది...'' అన్నాడు.

"అంటే?''

"నన్ను అపార్థం చేసుకోకమ్మా'' కొంచెం బెరుకుగానే ప్రారంభించాడు విశ్వనాథం. "నేనా గుడ్డివాణ్ణి. నాలుగుచోట్ల తిరిగి నీకు నాలుగు సంబంధాలు చూడలేను. కనీసం మీ అమ్మ బతికున్నా నీ మనసులో మాట ఏమిటో తెలుసుకుని నీ ముద్దూ ముచ్చటా చూసేది. నేను ఎందుకూ పనికిరానివాణ్ణి అయిపోయాను...''

"నాన్నా, మాటిమాటికీ మిమ్మల్ని మీరు అలా కించపరుచుకోకండి. ఆత్మన్యూనతా భావం ఆత్మహత్యతో సమానం. ఇప్పుడేమైంది? నాకు పెళ్ళయ్యే అదృష్టం ఉంటే అదే అవుతుంది. దానికి—''

"ఆ, ఆ అదృష్టమే ఇప్పుడు తలుపు తట్టి వచ్చిందని నాకనిపిస్తూందమ్మా.... అంటే ...నా మనసులో మాట బోధపడింది కదూ నీకు?''

"బోధ పడింది నాన్నా'' అని మాత్రం అని మౌనం వహించింది గాయత్రి.

ఒక్క క్షణం నిశ్శబ్దం తరువాత, "ఆ మాట అని నీ మనసు బాధపెట్టానా తల్లీ?'' అన్నాడు విశ్వనాథం.

"లేదు నాన్నా. దాని వెనుక ఉన్న నీ ఆందోళన, మమకారం నేను అర్థం చేసుకోగలను.''

"నాకూ తెలుసమ్మా! నువ్వు బుద్ధిమంతురాలివి, పరేంగితజ్ఞురాలివి'' కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"కాని అందరూ మనలా ఉండరు కదు నాన్నా'' అంది గాయత్రి. అందిగాని, తొందరపడ్డానా అని మధనపడింది ఒక్కక్షణం.

ఈసారి విశ్వనాథం మౌనం వహించాడు. "వాడి మనసు మంచిదమ్మా. ఎటొచ్చీ కొంచెం స్థిరం తక్కువ. అంతే'' అన్నాడు కొంతసేపుండి.

"మంచి మనసు ఉండడం ఒక్కటే చాలదు కదు నాన్నా''

"ఔననుకో. అయినా వాడికీ కొంచెం వయసు ముదిరిందని తప్ప— ఇంకేమీ ఎంచడానికి లేదు. మంచి తెలివైన వాడు. అమెరికాలో వాళ్ళతో గిట్టక వచ్చేశాడు గాని, ఇక్కడ ఏదో ఒక యూనివర్శిటీలో వాణ్ణి పిలిచి పదవి ఇస్తారు వాడు చేసిన

**రికార్డ్ స్థాయిలో అమ్ముడుపోయిన వీడియో కేసెట్లు!**

వీడియో క్రేజ్ విపరీతంగా ఉన్న రోజులు గదా ఇవి! వీడియో కేసెట్లు అద్దెకిచ్చే షాపుకెళ్ళి ఏ కేసెట్ ఎంచుకోవాలా అని ఒక్కోసారి తల బద్దలు కొట్టుకొంటూ ఉంటాం. అసలు ఇంతవరకు ప్రపంచం మొత్తం మీద ఎక్కువ వీడియో కేసెట్లు అమ్ముడుపోయిన చిత్రం పేరేమిటో తెలుసా? 'బెవర్లీ హిల్స్‌కాప్'! ఆ చిత్రాన్ని మీరు ఇంతవరకు చూడకపోయి ఉంటే, ఈసారి వీడియో రెంటల్ షాప్‌లోకి వెడితే, ఆ కేసెట్‌నే ఎంచుకోండి మరి!

వర్క్ కి...''

''సరే, ఉద్యోగమూ, సంపాదనా, పోషణా కాదు కదు నాన్నా మనకి ముఖ్యం! అదే అయితే నా ఉద్యోగం నాకు చాలు.''

''ఇంక మరేమిటమ్మా అభ్యంతరం? వయసు ఎక్కువనా?''

''నాకు మాత్రం పాతిక దాటలేదూ? అంతకంటే బాలా కుమారుడు ఎక్కడ దొరుకుతాడు?'' విషాదంగా నవ్వింది గాయత్రి.

''ఏదో కొంత సర్దుకుపోవడమూ, రాజీపడడమూ తప్పదమ్మా. ముఖ్యంగా మనకి బాగా తెలిసినవాడు, కావలసినవాడూను. ఆ నమ్మకమూ, భద్రతా ఉంటాయి...''

గాయత్రి మాట్లాడలేదు.

''సరే—ఒకచోట కుదురులేకపోవడం అంటావా? పెళ్ళయి ఇల్లూ సంసారం ఏర్పడితే అదే వస్తుంది కుదురు...''

ఆమె అప్పటికీ మాట్లడలేదు.

''బాగా ఆలోచించుకో అమ్మా! ఇందులో బలవంతం ఏమీ లేదు. కాని ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో అక్కడ ధైర్యంచేసి ఒక అడుగు ముందుకి వెయ్యాలి...నువ్వు ఊ అంటే వాడితో మాట్లాడతాను...''

''ఊహూ అప్పుడే వద్దు నాన్నా'' వారిస్తూ అంది గాయత్రి. ''ఇంకొంచెం టైమిద్దాం ఆయనకి.''

ఆశ్చర్యంగా చూశాడు విశ్వనాథం, గుడ్లకళ్ళతో. దేనికి? అని అడుగుదామనుకున్నాడు గాని, మానేసి. ''సరేనమ్మా, నీ ఇష్టం. నువ్వు ఎలా అంటే అలాగే...'' అంటూ కుర్చీలోంచి లేచాడు.

• • • • • •

మరో నాలుగు రోజులు గడిచాయి.

''రేపు సాయంకాలం ట్రైన్‌కి హైదరాబాద్ వెళుతున్నానురా. ఉస్మానియా వైస్ ఛాన్సలర్ నాకు తెలిసినవాడే. ఆయనతో మాట్లాడి వీలైతే అక్కడే సెటిల్ అవుదామని ప్రయత్నం'' అన్నాడు రామదాసు, వచ్చి విశ్వనాథం పక్కనే అరుగుమీద కూర్చుంటూ.

''ఆహా, పోనీలే! ఎక్కడో ఓ దగ్గర, మంచిదే'' అన్నాడు విశ్వనాథం. అవకాశం దాటిపోకుండా తన మనసులో మాట కూడా బయట పెట్టాలనిపించింది, కుమార్తె తొందరపడవద్దన్న సంగతి గుర్తుండి కూడా. ''గాయత్రి సంగతే ఏమీ తోచకుండా ఉందిరా'' అన్నాడు నిట్టూరుస్తూ.

''ఏ విషయం?'' అన్నాడు రామదాసు.

''ఇంకేముంది? పెళ్ళి చేసుకుని మొగుడూ పిల్లలూ సంసారం చూసుకోవలసిన వయసులో అదింకా ఇలా ఉద్యోగం చేస్తూ ఉండిపోవడం తలుచుకుంటే బాధగా ఉంది. ఆడపిల్ల తండ్రికి అంతకంటే చింత ఇంకేముంటుంది''?

''నువ్వు మరీ చాదస్తంగా మాటాడుతున్నావురా విశ్వనాథం! హాయిగా తన ఉద్యోగం తను చేసుకుని తన బతుకు తను స్వతంత్రంగా బతుకుతూంది. అలా ఉండనివ్వక పెళ్ళీ, పిల్లలూ అని ఆ రొంపిలోకి లాగుతానంటావేమిటి నువ్వు? తను సుఖంగా ఉండడం నీ కిష్టంలేదా ఏమిటి?'' అన్నాడు రామదాసు నిష్ఠూరంగా.

''అదేం మాటరా? నా కూతురు సుఖపడడం కంటే నాకు కావాల్సిందేముంటుంది? కాని ఆడదానికి కుటుంబ సౌఖ్యం, మాతృత్వం లేకపోతే జీవితం ఎలా పరిపూర్ణం అవుతుందిరా? ఈ ఉద్యోగాలు ఎన్నాళ్ళు చేసినా ఆ సాటి వస్తుందా?'' అన్నాడు విశ్వనాథం ఆందోళనగా.

''ఊరుకుందూ, నువ్వూ నీ బీసీ నాటి మాటలూను. లోకం ఎంతో మారిపోయిందో నువ్వింకా గుర్తించలేదురా విశ్వనాథం! ఇలా అంటున్నానని కోపం తెచ్చుకోకుగానీ, నీకు నిజంగానే కళ్ళులేవు. మాతృత్వం, మాంగల్యం అని ఎప్పటివో సెంటిమెంట్లు పట్టుకు వేలాడుతున్నావు. ఇప్పటి ఆడవాళ్ళకి కావాల్సినవి అవికావు — ఆర్థిక స్వేచ్ఛ, సమానత్వం, ఇండివిద్యుయాలిటీ...'' గొప్పగా అన్నాడు రామదాసు.

''కాని గాయత్రి నా కూతురురా, నా కూతురు!'' అన్నాడు విశ్వనాథం ఆవేదనగా.

''అయితే? నీ కూతురైనందుకు నీ పోలికలు కొన్ని రావచ్చేమోగాని, ఈ తరం ఆడపిల్ల నీలా ఆలోచిస్తుందనుకుంటున్నావా? లేనిపోని విచారాలు పెట్టుకోక, హాయిగా ఉండు.''

నిట్టూర్చడం మినహా మరేం చెయ్యలేకపోయాడు విశ్వనాథం. స్నేహితుడితో వాదించడం అనవసరం అని తేలిపోయింది. అయినా ఆఖరు ప్రయత్నంగా అడిగాడు—

''అయితే నువ్వు కూడా పెళ్ళీ, పెటాకులూ లేకుండా జీవితాంతం ఇలాగే ఉంటావా ఏమిటి?''

''ఆడవాళ్ళే పెళ్ళీ, జంజాటమూ వద్దంటూంటే, మగవాణ్ణి నాకెందుకురా? అసలు మొదటినుంచీ మన వివాహ వ్యవస్థమీద నమ్మకం లేదునాకు. బేకన్ ఏమన్నాడో తెలుసా? గొప్ప ఆశయాలూ, ఆదర్శాలూ ఉన్నవాళ్ళకి పెళ్ళాం పిల్లలూ గుదిబండలౌతారు కాబట్టి పెళ్ళే చేసుకోవద్దన్నాడు. నాకు నా రిసెర్చి, ఎకడమిక్ వర్క్ ముఖ్యం. ఐ హేవ్ నో టైమ్ ఫర్ డొమెస్టిక్ ట్రైఫుల్స్...'' తేల్చి చెప్పేశాడు రామదాసు.

మౌనంగా ఉండిపోయాడు విశ్వనాథం.



స్నేహితుడు మర్నాడు వెళ్ళిపోతున్నందుకు విచారంగా లేదు అతడికి. ఇంకా నాలుగు రోజులు ఉంటేనే ఇబ్బంది.

• • • • • • •

మర్నాడు ఆదివారం. ఆఫీసు లేదు కాబట్టి ఉదయాన్నే చీర ఎగ్గట్టి బూజు దులుపుతూంది గాయత్రి.

''గాయత్రీ, నా కళ్లజోడు కనిపించడం లేదు. ఆ గోట్లోనే పెట్టేను'' అంటూ వచ్చాడు అప్పుడే స్నానం చేసి వచ్చిన రామదాసు.

''ఎవరు తీస్తారండీ! అక్కడే ఉంటుంది సరిగ్గా చూడండి'' అంది గాయత్రి, పట్టుక్కర వదలకుండా.

''సరిగ్గా చూడడానికే కళ్ళజోడు కావాలి. అది ఉంటే ఇక వెతకడం దేనికి?''

''సరే, నే వచ్చి చూస్తాను పదండి'' అంది గాయత్రి.

''కాలిఫోర్నియాలో స్పెషల్‌గా గ్రైండ్ చేయించాను ఆ గ్లాసెస్. పోయాయంటే ఇక్కడ ఇండియాలో దొరకవు'' అంటూ ఆమె వెనకే నడిచాడు.

''ఇండియన్ లైఫ్ చూడడానికి అమెరికన్ కళ్ళద్దాలు అవసరంలేదు లెండి. అసలు పనికిరావు కూడాను'' వ్యంగ్యంగా అంటూ కళ్ళజోడు వెతికి ఇచ్చింది గాయత్రి.

''గుడ్ జోక్''అని వాటిని అందుకుంటూ, ''ఇలా ఎవరో ఒకరు వెనక ఉండి అవసరాలన్నీ చూస్తూ ఉంటే బాగుంటుంది'' అన్నాడు ఆమెను ఓరకంట చూస్తూ. నిన్న తండ్రి మాటలు విన్నాడు కాబట్టి ఇవాళ కూతురు లోతెంతో చూడాలనిపించింది అతడికి.

''అమెరికా నుంచి ఓ రాబో తెచ్చుకోలేకపోయారూ? మీ పనులన్నీ చేసిపెట్టేది!'' అంది గాయత్రి చురుగ్గా. గత కొద్దిరోజులుగా రామదాసు మాటలు, చూపులు క్రమంగా వంకర తిరగడం ఆమె గమనించకపోలేదు.

''రాబో లు తీర్చలేని అవసరాలు కొన్ని ఉంటాయి కదా'' ఇంకొంచెం ధైర్యంచేసి అన్నాడు.

అమెరికా వెళ్ళివచ్చిన అతడికి అది సరస సంభాషణ అనిపించిందిగాని, ఇక్కడి సంస్కృతికి వారసురాలైన గాయత్రికి మాత్రం అది వెకిలి తనమనిపించింది. అందుచేత నిరసనగా, ''మీ అవసరాలన్నీ బజార్లో తీర్చుకోవచ్చు'' అంది.

''అఫ్‌కోర్స్ అఫ్‌కోర్స్! ఇన్నాళ్ళూ ఆ పనే చేస్తున్నాననుకో! కాని హోమ్లీఫుడ్ అందుబాటులో ఉన్నప్పుడు హోటల్ ఫుడ్ తినాలనిపిస్తుందా?'' అన్నాడు తన చమత్కారానికి తనే మురిసిపోతూ.

ఆమెకి కోపం ముంచుకువచ్చి ఆవేశంలో ఏమీ మాట్లాడలేకపోయింది.

ఆమె మౌనాన్ని అలుసుగా తీసుకుని రామదాసు, ''నన్నంటావుగాని, నీ సంగతి చూడు! నీది అనుభవించవలసిన వయసు. నీకు మాత్రం కోరికలు ఎలా తీరుతాయి?'' అన్నాడు గొంతు తగ్గించి.

''అంటే? ఏమిటి మీ ఉద్దేశ్యం?'' కోపంగా అడిగింది గాయత్రి.

''ఏంలేదు, ఎలాగా మీ నాన్నకి కళ్ళులేవు, ఏమీ కనిపించదు. అంచేత నీ దారేదో నువ్వే చూసుకోవాలి...''

ఆమెకి కోపం కట్టలు తెంచుకుంది. ''రామదాసుగారూ స్నేహితులని ఆదరిస్తే హద్దులు మీరుతున్నారు, ఏమిటి మీ మాటలకి అర్థం?'' అని నిలదీసింది.

రామదాసు తడబడ్డాడు. ఆమె గొంతు విని వీధరుగుమీద జపం చేసుకుంటున్న విశ్వనాథం వస్తాడేమోనని కంగారుపడ్డాడు. అందుకని త్వరగా పరిస్థితిని చక్కదిద్దుతూ, ''అరె! ఇప్పుడు నేనేమన్నానని! నన్ను అపార్థం చేసుకుంటున్నావు. మీ నాన్న నీ పెళ్ళి గురించే వర్రీ అవుతున్నాడు, కాని తనేమీ చెయ్యలేడు కనుక నీ వరుణ్ణి నువ్వే ఎన్నుకోవాలంటున్నాను... అంతే...'' అన్నాడు సమర్థించుకుంటూ.

''మీరేమీ మాకు సలహాలు ఇవ్వక్కర్లేదు. ఇప్పటికిప్పుడు మాట మార్చకండి. మీ మాటల అంతరార్థం గ్రహించలేనంత అమాయకురాల్ని కాదు. మా నాన్నకి కళ్ళు కనిపించవని, నాకు పెళ్ళి కాలేదనీ మామీద మీరేమీ జాలిపడక్కర్లేదు. మీమీద మీరే జాలిపడండి. మా నాన్నకి చర్మ చక్షువులు లేకపోయినా మనసుకి కళ్ళున్నాయి. వాటితో ఆయన ఎదుటివారి మనసు చూడగలడు. నిజమైన గుడ్డివాళ్లు మీరే. మనుషుల్లో ప్రేమ, అభిమానం, ఆప్యాయత ఏమీ మీకు కనిపించవు. మీకు సెంటిమెంట్లు లేవు. మనసులేదు. మానవత్వం, మానవుల్లో దైవత్వం మీకు కనిపించదు. మా నాన్న దేవుడు. మామూలు గుడ్డివాడిలా కనిపిస్తే అది మీ దౌర్భాగ్యం. మీది కనిపించని చీకటి. అదే అసలైన గుడ్డితనం. మిమ్మల్ని ఆ భగవంతుడే రక్షించాలి...'' పరుషంగా, ఆవేశంగా అనేసింది.

ఇప్పటికే గది గుమ్మం దగ్గరకి వచ్చి నిలుచున్నాడు విశ్వనాథం. అతణ్ణిచూసి రామదాసు, ''చూడరా విశ్వనాథం, మీ అమ్మాయి నన్ను అనవసరంగా అపార్థం చేసుకుంటూంది'' అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

''రామదాసూ, ఇంకేం మాట్లాడకు. నీ సామాన్లు తీసుకుని వెళ్ళిపో. ఇంకెప్పుడూ ఈ ఇంటికి రాకు'' అన్నాడు విశ్వనాథం నిర్లిప్తంగా.

రామదాసు పెట్టేబేడా సర్దుకుని వెళ్ళిపోతూ ఉంటే, వెనకనుంచి రేడియో పాట అతణ్ణి సాగనంపింది:

కనులకు వెలుగువు నీవే కదా
కనబడు చీకటి మాయే కాదా;
వినుగనలేని ప్రాణి బతుకే
నిజముగ చీకటి ఔగా దేవా....

### ఈ సినిమా కథ ఖరీదు 15 కోట్లు!

ఒక నవలకో, నాటకానికో సినిమా హక్కుల కోసం కొన్ని వేల రూపాయలు చెల్లించటానికే మన నిర్మాతలు పదిసార్లు ఆలోచించి, వందసార్లు బేరమాడతారనేది ఇండస్ట్రీలో అందరికీ తెలుసు. అలాంటిది ఒక సినిమా తీసేందుకు సినిమా హక్కుల కోసం కొలంబియా సంస్థ 95 లక్షల డాలర్లు చెల్లించిందంటే మనకు ఆశ్చర్యంగా ఉంటుంది. 95 లక్షల డాలర్లంటే మన కరెన్సీలో సుమారు 15 కోట్ల 20 లక్షల రూపాయలన్నమాట! ఇంత మొత్తాన్నీ బ్రాడ్వే మ్యూజికల్ (నాటకం) 'యానీ'కి 1978 జనవరి 20న పువ్వుల్లో పెట్టి ఇచ్చినట్లు కొలంబియా సంస్థ సగర్వంగా ప్రకటించింది. ఆ మ్యూజికల్ రచయిత ఛార్లెస్ స్ట్రౌస్.